నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

గౌడ సంఘం అభివృద్ధికి కృషి

నవతెలంగాణ- ఖానాపూర్‌టౌన్



కులవృత్తి ఆధారంగా జీవనం సాగించే గౌడ కులస్తులు ఆర్థికంగా ఎదగడానికి తనవంతుగా కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల రాజేందర్ అన్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాజేందర్‌ను జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏండ్ల నుంచి గౌడజనులు ఆర్థిక, రాజకీయంగా వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. తనపై అపార నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పజెప్పిన సంఘం రాష్ట్ర జేఏసీ చైర్మెన్ నర్సాగౌడ్, జిల్లా, మండల నాయకులకు రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంటులో మహిళా బిల్లు విజయవంతంగా ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితను జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్ట సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తమ పార్టీ ఎప్పటి నుండో కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామని తెలిపారు. మహిళా బిల్లు విజయవంతం కావడం పార్టీ విజయమే కాకుండా దేశంలో ప్రతి మహిళ విజయంగా అభివర్ణించారు.



కలెక్టరేట్ ముట్టడికి యత్నం



- ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్
- గేటుకు వినతిపత్రం అందజేత

ఆదిలాబాద్‌టౌన్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ, గత కొన్ని రోజులుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురికి కాస్త తోపులాట జరిగింది. అనంతరం వినతిపత్రం అందజేసేందుకు లోపలికి వెళ్లగా అధికారులు ఎవరు లేకపోవడంతో కలెక్టరేట్ గేటుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని ప్రభుత్వంగా, బీజేపీ మాదిగల ద్రోహిగా మిగులుతుందన్నారు. అత్యధిక జనాభా కలిగినటువంటి మెజార్టీ మాదిగలు బీజేపీ వైఖరికి నిరసనగా రాజకీయంగా బొంద పెడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బారుకుంట సుభాష్, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు, గోటుముకలే మధుకర్, ఎంపల్లి గోవర్ధన్, మాదిగ జిల్లా కార్యదర్శిలు బొల్లారం నందకిషోర్, తరుడి శ్రీను, కొత్తపల్లి రాజేశ్వర్, ఆరెపల్లి సురేష్, అడ్డిగ స్వామి, అల్లకొండ రవి, ఎంఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ పసుల శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

ఆహారంతోనే ఆరోగ్యం



జైపూర్ : ఆరోగ్యంగా జీవించాలంటే మనం తీసుకునే ఆహారం పౌష్టికరమైనది ఉండాలని జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి అన్నారు. టేకుమట్ల సెక్టార్ పరిధి నర్సింగాపూర్ అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు వారిగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు తీసుకునే ఆహారంలో పప్పు దినులు, పాలు, గుడ్లు, కూరగాయలు తీసుకోవాలని, ఆరోగ్యానికి మించిన సంపద లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పండుగ బుచ్చమ్మ, ఎంపీటీసీ బోయిన స్వాతి సంపత్, ఎంపీడీఓ సత్యనారాయణ, అంగన్‌వాడి సూపర్వైజర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేరు చేయాలి

జన్నారం : డంపింగ్ యార్డ్‌కు వచ్చే చెత్తలో నుంచి తడి పొడి చెత్తలను వేరు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ గ్రామ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్న తరుణంలో బావుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ రమేష్, సర్పంచ్ జక్కు, కార్యదర్శి రాహుల్ ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశానికే గర్వకారణం

ఉట్నూర్: మహిళా రిజర్వేషన్ బిల్లుకు దేశానికే గర్వాకారణమని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్ అన్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలతో సంఘీభవం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాటం పట్ల ఇది సాధ్యమైయిందని హర్షం వ్యక్తం చేశారు. 70సంవత్సరాల కింద మహిళల సాధికారత, మహిళా రిజర్వేషన్స్ గురించి తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవ కారణంగానే బిల్లుకు మోక్షం లభించిందని కొనియాడారు. ఈ బిల్లు ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలవుతాయని, మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు బీఆర్ఎస్ అలుపెరుగని పోరాట ఫలితమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీఎస్ఎస్ఓ నాయకుడు జాడి వెంకటేష్, వికాస్ వావల్కర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

నిర్మల్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో 300 మంది మైనార్టీ మహిళలకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, మైనార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డిలు శుక్రవారం గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జన దినోత్సవాన్ని అందరూ కలిసి ఐక్యమత్యంగా నిర్వహించుకోవాలని, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అన్నారు. నిమజ్జనం రోజున గణేష్ మండపాల నిర్వహకులు డీజే అనుమతి తీసుకోవాలని అన్నారు. సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ విలాస్, పంచాయతీ కార్యదర్శి అశోక్, పోలీస్ సిబ్బంది, మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

నూతన డీఐఈఓకు సన్మానం

ఆసిఫాబాద్ : జిల్లా నూతన ఇంటర్మీడియట్ విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నైతం శంకర్‌ను ప్రభుత్వ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ కళాశాలల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్, తిరుపతి, ఆసిఫ్, అమీరున్నీస, సంపత్, రామారావ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె

నవతెలంగాణ-చింతలమానేపల్లి

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి అంగన్‌వాడీలను కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరక శ్రీకాంత్, మండల అధ్యక్షులు చెన్నూర్ శంకర్, సీఐటీయూ కన్వీనర్ డోర్లికర్ విలాస్ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మంగ, శ్రీలత, జయ, శివానీ పాల్గొన్నారు.



దహెగాం : తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 12వ రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా నాయకురాలు వజ్రమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీలు అనేక రకాల సేవలందిస్తున్నా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకుండా మొండివైఖరి వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఈశ్వరి, రూప, జయ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

తాండూర్ : సమ్మెలో భాగంగా తాండూర్‌లో అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని, పేస్కేల్ అందించాలని, బీమా సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు.

కెరమెరి : అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సేవలు గుర్తించి వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలు అనసూయ, బొజ్జుబాయి, లింగుబాయి, అనిత, ప్రమీల తిరువన, జ్యోతి, గంగుబాయి, రేణుక, జైనబాయి పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం కొనసాగుతుండగా అంగన్వాడీలు చేరుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డికి, మండల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమ్మెకు మద్దతు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు నాయకులు లింగాల చిన్నన్న, అంగన్వాడీలు ఉన్నారు.



దహెగాం :



తాండూర్ :

పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న రూ.5177 కోట్ల స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. 5సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5,177 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలన్నారు. సంక్షేమ వసతి గృహా విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్‌తో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంన్నాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని విమర్శించారు. తక్షణమే విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. జిల్లావ్యాప్తంగా గురుకులాలకు సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను పునర్ ప్రారంభించాలని, ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు రుద్ర ప్రతాప్, ఉదయ్, జిల్లా నాయకులు రాజు పాల్గొన్నారు.



విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లాలో డెమో స్కూల్ ప్రోగ్రాం కొరకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా అధికారులు సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని 4 మండలాలలో 55 ప్రభుత్వ పాఠశాలలలో డెమో స్కూల్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులను గ్రూపులుగా తయారు చేసి వారి ఆలోచనలను ఇతర విద్యార్థులతో పంచుకునే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలలో అసెంబ్లీ, క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతరమైన పద్ధతులను విద్యాబోధన చేయాలని తెలిపారు. పిరమిడ్ సభ్యుల సహకారంతో 100 రోజుల కార్యక్రమాన్ని కొనసాగించాలని, ప్రారంభ, మధ్య, అంత్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం డెమో స్కూల్ కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంగన్వాడీలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఆసిఫాబాద్: అంగన్వాడీలపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్వాడి వర్కర్లు చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని 11 రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారని అన్నారు. శాంతియుతంగా సమ్మె జరుగుతుండగా ప్రభుత్వమే అంగన్వాడీలను రెచ్చగొట్టే విధంగా సెంటర్ల తాళాలు పగలగొడుతున్నారని అన్నారు. ఇటువంటి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా అంగన్వాడీలపై అక్రమంగా పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీస వేతనం రూ.26వేలు, వారసత్వ ఉద్యోగాల తదితర వాటిపై చర్చించకుండా అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరపాలని, లేనిఎడల ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



పశువుల్లో పునరుత్పత్తి, ఫలదీకరణ పెంచడమే లక్ష్యం

- జిల్లా పశు వైద్యాధికారి సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పశువుల్లో పునరుత్పత్తి, ఫలదీకరణ పెంచడమే లక్ష్యమని జిల్లా పశు వైద్యాధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా పశుదన్ జాగృతి యోజన పథకం కింద మండలంలోని చిర్రకుంటలో రైతులకు పశువులలో ఫలదీకరణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కోరుట్ల పశు వైద్య కళాశాల డీన్ మాధవరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణకుమారి, ప్రోగ్రాం చైర్మన్ నాగరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల్లో పునరుత్పత్తి ఫలదీకరణ పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫలదీకరణ పెంచడం లక్ష్యంగా జిల్లాను ఎంపిక చేసిందన్నారు. రైతులు తమ పశువుల పునరుత్పత్తి ఫలదీకరణ కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని మందులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో 500 ఆవులు, బర్రెలు, 800 గొర్రెలకు వివిధ వ్యాధుల నుండి రక్షించడానికి అవసరమైన చికిత్స చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల కళాశాల సహాయ ఆచార్యులు ప్రియాంక, సంతోషిని, పరుశురాం, సురేష్, మండల వెటర్నరీ వైద్యాధికారులు మురళీకష్ణ, రామకష్ణ, శివ సర్పంచ్ పార్వతిబాయి, ఎంపీటీసీ శంకర్ గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై 26న మహాధర్నా

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ పీఆర్సీలు, డిఏలతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో కార్మికులతో కలిసి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం కంటే ముందున్న 2013 పిఆర్సి బాండ్ల ఏరియర్స్ డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని, 2017, 2021 పెండింగ్ పేస్కేల్స్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విలీనం కంటే ముందే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీటితో పాటు ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ ఈ నెల 26న ఇందిరాపార్కు దగ్గర జరిగే మహాధర్నాను ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) డిపో కార్యదర్శి టి.దివాకర్, నాయకులు గంగన్న పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ- ఉట్నూర్

ఉద్యాన పంటల సాగుపై గిరిజన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ అన్నారు. గిరి రైతులకు అందించేందుకు, ఉద్యాన నర్సరీలో వివిధ రకాల పండ్ల మొక్కలను సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఉద్యాన నర్సరీలో అంతర పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటలకు బదులుగా, ఉద్యాన పంటలు సాగు వైపు గిరిజన రైతులను ప్రోత్సహించాలని అన్నారు. దానికి అనుగుణంగా రైతులకు క్షేత్ర స్థాయిలలోకి వెల్లి పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు. వాణిజ్య ఉద్యాన పంటల సాగుపై తేడాలు సూచిస్తే, రైతులు అర్థం చేసుకునే వీలుంటుందన్నారు. రైతులు సాగు చేసుకునే పంటల్లో అంతర పంటలుగా ఉద్యాన పంటలు సాగు చేయొచ్చన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీహెచ్ఓ సందీప్, ఈజీఎస్ ఏపీఓ రజినీకాంత్, ఏఈఓ సుధీర్, లక్కారం ఉప సర్పంచ్ కొల సత్తన్న రైతులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ఆర్.రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్మెంట్ అధ్యయన బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మౌలిక వసతులు కల్పనకు ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన అధ్యయన బృందం సభ్యులు సుందర్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, ఏసిఎంవో ఉద్ధవ్, జిసిడివో శకుంతల, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల వినాయకుల నిమజ్జనం

దహెగాం : మండల కేంద్రంలోని బుడిపెల్లివాడ, సపుడవాడల్లో బాల వినాయకుల నిమజ్జనం ఘనంగా ముగిసింది. ఆయా మండపాల వద్ద ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమీప పెద్దవాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో స్థానిక బాలలతో పాటు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

కడెం ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద ప్రవాహం

నవతెలంగాణ-కడెం



కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కడెం ప్రాజెక్టులోనికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు, 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 697.250 అడుగులు, 6.904 టీఎంసీలలో కొనసాగుతుంది. ఇన్ ఫ్లో ప్రాజెక్ట్‌లోకి 7598 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరడంతో ప్రాజెక్ట్ 1 వరద గేట్ ఎత్తి 5896 క్యూసెక్కుల నీటిని దిగువ నున్న గోదావరిలోకి అధికారులు వదిలారు. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో డిగ్రీ విద్యార్థిని ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు తమ ప్రతిభ కనబరిచారు. గురువారం జరిగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాల నుంచి బీకాం ఫస్ట్ ఇయర్ విద్యార్థిని వసంత ట్రిపుల్ జంపు విభాగంలో రజత పతకం సాధించింది. కళాశాలకు చెందిన ఇతర విద్యార్థినులు జ్యోతి, శ్రీజ డిస్కస్ త్రో, అంజలి లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత, స్పోర్ట్స్ ఇన్‌చార్జీ డాక్టర్ కోటయ్య, గణపతి విద్యార్థినులను శుక్రవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, చంద్రకాంత్, నరేష్ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-జైనథ్

మన చుట్టూ ఉన్న పరిసరాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ నైనిత అన్నారు. శుక్రవారం మండలంలో లక్ష్మీపూర్ గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యసిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి లక్ష్మీ రాములు, కార్యదర్శి ముజీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డీఐఈఓ పరశురాం అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేట్టు చూడాలని, హాజరు శాతం పెంచాలన్నారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామపంచాయతీలో ఐదు ఇంకుడు గుంతలు నిర్మించాలి



నవతెలంగాణ-పెంబి

ప్రతి గ్రామంలో ఐదు ఇంకుడు గుంతలు నిర్మించాలని ఎంపీఓ రత్నాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగపూర్‌లో ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇనుకుడు గుంతలు, గోబర్ గ్యాస్, వాచ్ ఆన్ వార్డ్ నిర్మించుకోవాలని అన్నారు. దీన్ని సర్పంచులు సెక్రటరీలు ముందుండి నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు



నవతెలంగాణ-నార్నూర్

అంగన్‌వాడీల సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, అంగన్‌వాడీలు మాట్లాడుతూ గత 46 సంవత్సరాలకుపైగా ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ సేవలందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కనీస వేతనం రూ.26 వేలతో పాటు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో నాయకులు ఝాడే నాందేవ్, వివిధ గ్రామాల అంగన్‌వాడీలు జాదవ్ పంచశీలా, పంచపూల, రాథోడ్ సావిత్రి, రాథోడ్ స్యామక, పంచుబాయి, చాయ, మాయ, రత్న, మీరాబాయి, సునీత ఉన్నారు.

ఇన్‌చార్జీ డీఆర్వోగా రాథోడ్ రమేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ రెవెన్యూ అధికారిగా రాథోడ్ రమేష్ నియామకమయ్యారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారిగా పనిచేస్తున్న ఆయనను గత ఐదేండ్లుగా ఖాళీగా ఉన్న డీఆర్వో పోస్టులో నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. కాగా ఇదివరకు ఆయన ఆదిలాబాద్ ఆర్డీఓగా పనిచేస్తూ, ఇటీవల ఎన్నికల బదిలీల్లో భాగంగా కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లి తిరిగి జిల్లాకు వచ్చారు.

రిలే నిరాహారదీక్షలు ప్రారంభించిన అంగన్‌వాడీలు

- 12వ రోజుకు చేరుకున్న సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతుంది. శుక్రవారంతో ఈ సమ్మె 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి పాల్గొని, నిరసనకారులకు మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 12 రోజులుగా అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల సాధనకోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరపకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వెంటనే ప్రభుత్వం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సామరస్యంగా చేస్తున్న అంగన్‌వాడీల సమ్మె ఎటువంటి నిర్బంధాన్ని ప్రయోగించకూడదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలు సామరస్యంగా పరిష్కరించాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యం కల్పించాలని ఇతర డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు మధునిక, కవిత, కళావతి, శోభా, ప్రమీల, మంజుల, రాధా, కిష్టమ్మ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- అవగాహన సదస్సులో జనరల్ మేనేజర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు, స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు, పారిశ్రామిక వేత్తలకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుద్యోగులు సద్వినియోగపరచుకొని ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచుకోవాలని అన్నారు. నిత్యా జీవన విధానంలో సాంకేతిక వినియోగం పెరిగిందని, కాలానుగుణంగా వినియోగించే వస్తువుల రూపాల్లో, పని చేసే విధానంలో మార్పులు జరిగాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానం టీఎస్ ఐపాస్, తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇంక్యూబేషన్ దళిత్ ఎంటర్ ప్రెన్యూర్స్ ఇన్సెంటివ్ స్కీం టీ ప్రైడ్, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ పీఎంఈజీపీ, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి, తయారీ సంస్థలు క్రమబద్ధీకరణ పథకం పీఎంఎఫ్ఎంఈలను వివరిస్తూ, ఆసక్తి గల వారు సద్వినియోగపరచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. స్థాపించే పరిశ్రమకు సంబంధించిన మిషనరీలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను ప్రవేశపెట్టి సబ్సిడీ అందజేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు, స్వయం సహాయక సంఘాలు, మహిళలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాల నివృత్తి, ఇతర సమాచారం కోసం ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. సమావేశానికి హాజరైన పలువురు అడిగిన సందేహాలను జీఎం, బీసీ, ఎస్సీ కార్పొరేషన్, ఎల్‌డీఎం అధికారులు నివృత్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో ఎల్‌డీఎం భాస్కర్, బీసీ సంక్షేమశాఖ అధికారి రాజలింగం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, రిసోర్స్ పర్సన్ శివ శంకర్, యువతీ, యువకులు, మహిళా సంఘాలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

అగ్రకులాల మహిళా బిల్లును రద్దు చేయాలి

- డీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- మహిళా బిల్లు దిష్టిబొమ్మ దహనం
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు అది అగ్రకుల మహిళా రిజర్వేషన్ బిల్లని, దానిని వెంటనే రద్దు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అగ్రకుల మహిళలకే న్యాయం జరుగుతుంది తప్ప పీడిత బాధ్యత వర్గాలకు మేలు చేకూరదని పేర్కొన్నారు. అగ్రకులాలకు సానుకూలంగా ఉన్న బిల్లును తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని వెంటనే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక అగ్రకులాల పురుషాధిపత్యం పోయి అగ్రకుల మహిళాధిపత్యం మొదలవుతుందని పేర్కొన్నారు. 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత మైనార్టీల మహిళలకు 90శాతం ఉపకోట కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ ఇండియా కూటమి పార్టీల దిష్టిబొమ్మలను, రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మను దహనం చేశారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సమాజానికి నష్టం కలిగించేలా బిల్లును రూపొందించారని, బలహీన, బాధిత, పీడిత వర్గాలకు మరో రూపంలో ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రపతి పేరుతో కూడిన లేఖను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా నాయకులు ఎల్మల మంజుష, ఏనుగు శ్యామల, సంగర్తి లక్ష్మి, సుష్మ, పడకుంటి రాజీవ్, ప్రవీణ్, కరాడి గంగన్న, నవీన్, సాయి, రవి, విఠల్, ప్రమోద్, వెన్నెల, రమేష్, సంతోష్, ప్రతాప్ ఉన్నారు.

సహకార సంఘం బలోపేతమే లక్ష్యం



నవతెలంగాణ-తాంసి

ప్రాథమిక సహకార సంఘం బలోపేతమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి సంబంధించిన ఏజెండాను అంశాలను సీఈఓ కేశవ్ చదివి వినిపించి, సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ మూడు మాసాలకు ఒకసారి సొసైటీ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గతంలో కంటే ఇప్పుడు సొసైటీలు ఎంతో బలోపేతం అయ్యాయని గతంలో రూ.9కోట్ల టర్నోవర్ ఉంటే ఇప్పుడు రూ.14 కోట్లు టర్నోవర్ అయ్యాయని అన్నారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు రుణాలు అందించడం జరుగుతుందని అన్నారు. మూడు ఎకరాల భూమి ఉన్న రైతులకు హౌసింగ్ లోన్, ట్రాక్టర్ లోన్, వ్యవసాయ భూముల ఆధునీకరణకు లోన్లు, ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వచ్చే రోజుల్లో బంగారంపై రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రయివేటు రుణాలు తీసుకొని అధిక వడ్డీలు చెల్లించి, మోసపోవడం జరుగుతుందని అన్నారు. సహకార సంఘం బ్యాంకుల్లో రైతులు తక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని అభివృద్ధి చెందాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంకులను బలోపేతం చేసుకోవాలన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలను కొనుగోళ్లు రైతులకు అందిస్తున్న ఎరువుల వల్ల వచ్చే కమిషన్‌తో సొసైటీ బలోపేతం అవుతుందన్నారు. సహకార సంఘాలను కాపాడుకునే బాధ్యత రైతులపైనే ఉంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ధనుంజయ్, సభ్యులు అశోక్‌రెడ్డి, భూమారెడ్డి, లక్ష్మీనరసింహ, రమేష్, చంద్రన్న, సొసైటీ సిబ్బంది, సుధాకర్, గణేష్, సిద్ధార్థ్ రెడ్డి, ఇంతియాజ్ ఉన్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



నవతెలంగాణ-బోథ్

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 70వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని మానవహారంగా ఏర్పడి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దీక్షా శిబిరం వద్ద దాదాపు రెండు కిలోమీటర్ల మనవహారంగా ఏర్పడి రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను తెలియజేశారు. రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కల్వకుంట్ల తారక రామారావు ఈనెల 25న నిర్మల్ జిల్లా పర్యటనలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు గురించి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన జీఓను విడుదల చేయాలని, రెండు నెలలకు పైబడి ఉద్యమం చేస్తున్న స్థానిక అధికార పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉద్యమ తీవ్రతను గమనించి రెవెన్యూ డివిజన్ ప్రకటించాలన్నారు. అలాగే 31 అంశాలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇక్కడి నాయకత్వంతో చర్చలు జరపాలని లేకుంటే ప్రజాఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. అదేవిధంగా నిరసన వ్యక్తం చేస్తూ 23న బోథ్ మండల వ్యాప్తంగా వర్తక వాణిజ్య వ్యాపార హోటళ్లు పూర్తి సంపూర్ణ స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే పదిశాతం రాయితీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీలో అప్ అండ్ డౌన్ రిజర్వేషన్ చేసుకున్న వారికి పది శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆర్టీసీ డీపో మేనేజర్ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి 29 వరకు దూర ప్రాంతాలకు వెళ్లే వారికి గురువారం నుంచి ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకున్న వారికి పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్టు తెలిపారు. వచ్చే నెల 13 నుంచి పాఠశాలలకు సెలవులు ఉన్నందున విద్యార్థులు వ్యాపారస్తులు మీ సొంత ఊర్లకు వెళ్లి రావడానికి ముందస్తుగా రాను పోను టికెట్టు బుక్ చేసుకుని ఆర్టీసీ వారు కల్పిస్తున్న రాయితీ పొందాలని సూచించారు. మిగతా వివరాలకు టీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ లేదా ఆదిలాబాద్ బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లు సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులు రాజ్‌బోడపై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ నాయకుడు రాజ్ బోడాపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు చిలుముల పంచాక్షరి అన్నారు. శుక్రవారం బోథ్ పోలీసు స్టేషన్‌లో రాజ్‌బోడాపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీఎస్పీ బలపడుతున్న తరుణంలో అమెరికాలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు రాజ్‌బోడా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ప్రజలల్లో బీఎస్పీకి రోజు రోజుకీ పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక అగ్రవర్ణ పార్టీలకు చెందిన వారు కుట్రలు చేసి ప్రవీణ్ కుమార్ గౌరవానికి భంగం కలిగించే విధంగా అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదని అన్నారు. రాజ్ బోడా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే రాజ్ బోడా మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రవీణ్, బోథ్ సెక్టార్ అధ్యక్షులు గడ్డం నగేష్, నాయకులు గడప ప్రవీణ్, ఎరేకర్ రాహుల్, కలిగేటి గంగాధర్, ఆరిపెల్లి సన్ని పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని రాస్తారోకో



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని సరస్వతినగర్ వద్ద భైంసా-బాసర రహదారిపై శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నందకూమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్లమెంటు సభ్యులు కాంగ్రెస్ సభ్యులు, కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకపోతే తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఈ దిశగా ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సాయి చంద్, బాబు, విఠల్, నగేష్, ప్రవీణ్, అజయ్, సాయిప్రసాద్, సాహెబ్‌రావు, గంగాధర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నవతరం తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అక్టోబర్ 6, 7, 8 తేదీలలో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వర్షన్ హాలులో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్లను శుక్రవారం కాగజ్‌నగర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ఫొటో ఎగ్జిబిషన్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఫొటో, వీడియోగ్రాఫర్స్ వస్తారని, ఇందులో ఆధునిక సాంకేతికతో కూడిన కెమెరాలతో పాటు కెమెరాల విడిభాగాలను కూడా ప్రత్యేక ఆఫర్లతో విక్రయిస్తారని తెలిపారు. ఒక పండుగలా నిర్వహించే ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అక్రమ అరెస్టులను సహించం

కెరమెరి : అక్రమ అరెస్టులను సహించేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ జాఫర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులపై విచక్షణ రహితంగా పోలీసుల దాడి చేసి లాఠీ చార్జీలు చేయడాన్ని ఖండించారు. పెద్దపల్లి శాసన సభ్యులు దాసరి మనోహర్‌రెడ్డి ఒక ప్రైవేట్ విద్యాసంస్థకు చైర్మన్ అయి ఉండి పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ కళాశాలను కూల్చివేయడానికి సిద్ధపడ్డారని తెలిపారు. దీంతో నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని వాపోయారు. సదరు ఎమ్మెల్యే చేస్తున్న ఈ ప్రయత్నాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, నాయకులు ప్రశాంత్, తిరుపతి ఉన్నారు.



గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం కౌన్సిల్ ఫర్ డెవలప్‌మెంట్ అధ్యయన బృందం సందర్శించింది. బృందం సభ్యులు సుందర్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందే ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం కల్పించిన ఆరోగ్య సౌకర్యాలు, వైద్య వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్, వార్డెన్ శ్రీనివాస్‌లను ప్రశ్నించారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ కమర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు ప్రసాద్, క్రీడల అధికారి బి మీనారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1969 నుండి 2014 వరకు తొలి, మలి దశ ఉద్యమంలో పాలుపంచుకున్నామని, 1969లో ఒక విద్యాసంవత్సరాన్ని కూడా అప్పటి ఉద్యమకారులు కోల్పోయారని పేర్కొన్నారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఏర్పడగానే అక్కడి ఉద్యమకారులకు పెన్షన్, ఇల్లు, వైద్యం ఇతర సదుపాయాలు కల్పించారని, తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకు గుర్తింపు లేదని అన్నారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించని పక్షంలో హైద్రాబాద్‌లోని ధర్నా చౌక్‌లో ఉద్యమం చేస్తామని అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చక్రహరి రామరాజు ఇప్పటికే ప్రకటించారని పేర్కొన్నారు.

28 నుండి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



నవతెలంగాణ - దహెగాం

తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 28 నుండి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు మధ్యాహ్నభోజన కార్మికులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యాధికారి కార్యాలయంలో సీసీఓ రాజేష్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెంచిన వేతనాలను, ఏరియర్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూను మార్చాలని, గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. ఐడీ కార్డులు కూడా ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28 నుండి సమ్మెలోకి వెళ్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, పార్వతి, సరస్వతి, మల్లక్క పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



నవతెలంగాణ - దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో శుక్రవారం శ్రీలక్ష్మి వెంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ దేవాలయంలోని వినాయక మండపం వద్ద శుక్రవారం కుంకుమ పూజలు వేద పండితులు బాచంపెల్లి కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ దిగువ స్వప్న శ్రీనూసింగ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ రమేష్, స్థానిక సర్పంచ్ బండ కృష్ణమూర్తితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీఎల్పీఓగా అహ్మద్ ఉమర్ హుస్సేన్

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి(డిఎల్పిఓ)గా అహ్మద్ ఉమర్ హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ బోర్కడే హేమంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, పల్లె ప్రకృతి వనాలు హరితహారం కార్యక్రమాలపై గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ , జూనియర్ అసిస్టెంట్ సంతోష్ , బిల్ కలెక్టర్ నాగేందర్, మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి, వివిధ సంఘాల నాయకులు అబ్దుల్ రహమాన్, ప్రకాష్ గౌడ్, ఎండీ అహ్మద్, షబ్బీర్, అసద్, గుండా శ్యామ్ వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



కొనసాగుతున్న లారీ యజమానుల సమ్మె

- మద్దతు ప్రకటించిన ఎస్పీఎం నెగోషియన్ కమిటీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ డిమాండ్ల సాధనకు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చేపడుతున్న సమ్మె ఇంకా కొనసాగుతూనే ఉంది. సమ్మె చేపట్టి మూడు రోజులు కావస్తుండడంతో సిర్పూరు పేపర్ మిల్లులో నిల్వలు పేరుకుపోతున్నాయి. మిల్లు యాజమాన్యం స్థానిక లారీలను కాదని, బయటి లారీల ద్వారా పేపర్ నిల్వలను తరలిస్తుండడాన్ని స్థానిక లారీ యాజమానులు వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఇదే విషయమై పలు మార్లు ఎస్పీఎం యాజమాన్యంతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో స్థానిక లారీ యాజమానులు సమ్మెకు దిగారు. సమ్మె చేపట్టే ముందే జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడారు. అయినా సమస్య కొలిక్కి రాకపోవడంతో లారీ యాజమానులుఈ నెల 20 నుండి సమ్మె చేపడుతున్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా రవాణా ఛార్జీలు పెంచాలని, మిల్లు ఉత్పత్తులను దేశంలోని 181 ప్రాంతాలకు యాజమాన్యం సరఫరా చేస్తోందని, ఇందులో తమకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, టోల్ ఫీజులలో 70 శాతం యాజమాన్యం భరించాలని, లోడింగ్, అన్‌లోడింగ్ బాధ్యత యాజమాన్యమే తీసుకోవాలని, దూరప్రాంతాల నుండి వచ్చే డ్రైవర్లు, క్లీనర్లకు క్యాంటీన్ సదుపాయం కల్పిస్తూ రెస్టరూంలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో వీరు సమ్మెకు దిగారు. ఇప్పటికే ఈ సమ్మెకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని లారీ యజమానుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. శుక్రవారం ఎస్పీఎం నెగోషియన్ కమిటీ సభ్యులు కూడా లారీ అసోషియేషన్ కార్యాలయానికి వెళ్లి తమ సంఘీభావం తెలిపారు. మిల్లు యాజమాన్యం అటు స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా అన్యాయం చేయడమే కాకుండా, స్థానిక లారీలను కాదని బయటి లారీల ద్వారా ఉత్పత్తులను తరలిస్తూ మోసం చేస్తోందని వారు ఆరోపించారు. మద్దతు తెలిపిన వారిలో నెగోషియన్ కమిటీ సభ్యులు ఎకె సింగ్, షబ్బీర్‌హుస్సేన్, శంకరయ్య, సునీల్‌సింగ్, రాంచందర్, లోకేష్, వేణు ఉన్నారు.

కొనసాగుతున్న చర్చలు

మిల్లు యాజమాన్యంతో ప్రతి రోజు లారీ యాజమానుల చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం కూడా లారీ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి నిజాముద్దీన్, ఉపాధ్యక్షులు షమా, కోశాధికారి సయ్యద్ ఖయ్యూం మిల్లులో చర్చలు చేపట్టారు. అవి ఒక కొలిక్కి రాలేదని తెలిసింది.

అధికారులు ప్రగతి నివేదికలు అందజేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

2014 నుండి ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో ప్రగతి నివేదిక తయారుచేసి అందించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 నుండి ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలు తయారుచేసి అందించాలని తెలిపారు. ఆసరా పెన్షన్‌లో కేటగిరీల వారీగా లబ్ధిదారుల వివరాలతో నివేదిక తయారు చేయాలని, రైతుబంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ లబ్ధిదారుల జాబితా, 24 గంటల ఉచిత విద్యుత్ పొందుతున్న రైతుల వివరాలు, సంక్షేమ శాఖల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల జాబితా అందించాలని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రగతి నివేదిక రూపొందించేందుకు అన్ని శాఖల అధికారులు ఈనెల 26వ తేదీలోగా తమ శాఖల పూర్తి వివరాలను సమర్పించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు, తప్పులు లేకుండా కచ్చితమైన సమాచారంతో నివేదిక అందించాలని, ఏదైనా సమాచారం కొరకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సంప్రదించాలని తెలిపారు. ఈ సమీక్షలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి సమన్వయంతో పని చేయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల సంక్షేమంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో జిల్లాలో చేపట్టవలసిన సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు వారి వివరాలు అందించి రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. వివరాలు నమోదు చేసుకుని ప్రతి నెల వారికి నిర్వహించే పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. రక్తహీనత కలిగిన గర్భిణులు, బాలింతలు, పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించాలని, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీ చేసి వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. రిస్క్ కలిగిన వారి ఆరోగ్య పరిస్థితులను రెండు శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగిన వారికి కెసిఆర్ కిట్లు అందించి వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లల సంక్షేమంపై వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ఎవరెస్టు కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ ఎవరెస్టు కార్మికుల సమ్మెతాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఎల్ అండ్ టి యాజమాన్యం గతంలోని స్పందించి సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వడంతో వారు విధుల్లో చేరారని, ఎవరెస్టు కంపెనీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారని తెలిపారు. అయితే తాజాగా శుక్రవారం కార్మిక సంఘాల నాయకులకు ఎవరెస్ట్ యాజమాన్యం హెచ్ఆర్ సందీప్ ఇంజనీర్ లు నిఖిల్ లక్ష్మణ్ మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు నాయకులు చర్చల అనంతరం తెలిపారు. దీనితో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వివరించారు. యాజమాన్యం అక్టోబర్ 4 తేదీ వరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలిక వాయిదా వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నుంచి బోగే ఉపేందర్, లోకేష్, దివాకర్, చిరంజీవి, రాజేందర్, ప్రేమ్ దాస్, రాజేష్ పాల్గొన్నారు.

స్టేషనరీ వస్తువులకు పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో 26న వేలం

ఆసిఫాబాద్ : జిల్లాలోని పోలీస్ శాఖకు సంబంధించిన స్టేషనరీ వస్తువులకు ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లో వేలం నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఇతర వివరాల కోసం 8712670520 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇద్దరు రేషన్ డీలర్లపై కేసు నమోదు



నవతెలంగాణ-దహెగాం

రేషన్ దుకాణంలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు రేషన్ డీలర్లపై శుక్రవారం 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్యామ్‌లాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని లగ్గం, ఒడ్డుగూడ గ్రామాల్లోని రేషన్ దుకాణాలను ఆర్ఐ శృతి, నాందేవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు తెలిపారు. ఒడ్డుగూడ రేషన్ దుకాణంలో లబ్దిదారులకు పంచిన తరువాత మరో 4.50 క్వింటాళ్ల బియ్యం అధికంగా నిల్వ ఉంచినట్లు తేలింది. అలాగే లగ్గం రేషన్ దుకాణంలో క్వింటాలు బియ్యం తక్కువగా ఉండటంతో ఒడ్డుగూడ డీలర్ సత్యాగౌడ్, లగ్గం డీలర్ నగేష్‌లపై కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. రెండు రేషన్ దుకాణాలకు గూడెం డీలర్ శ్రీనివాస్‌గౌడ్‌కు ఇన్‌చార్జి భాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలలో స్థానికులకు అవకాశం ఇవ్వాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ ఏర్పాటు స్వాగతించదగిందన్నారు. అయితే కళాశాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో 32 పోస్టులు భర్తీ చేయడానికి ఏజెన్సీ ద్వారా ప్రిన్సిపాల్ పేరుతో నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వీటిలో 100 శాతం స్థానికులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ హడావిడిగా జిల్లా కేంద్రంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని తన ఏజెన్సీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని, దరఖాస్తుల స్వీకరణ తర్వాత కార్యాలయాన్ని మూసివేశారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెడికల్ కాలేజ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయం చెప్పలేదని, ఎక్కడ నిర్వహిస్తారని తెలియని అయోమయంలో అభ్యర్థులు ఉన్నారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని అర్హులైన స్థానిక అభ్యర్థులకు మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 19 అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉన్నప్పటికీ వాటి కార్యాలయాలు జిల్లా కేంద్రంలో లేవని, కొన్ని కార్యాలయాలు ఇండ్లలోనే కొనసాగుతున్నాయన్నారు. అటువంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్‌కుమార్, గెడం టికానంద్ పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. అనంతరం డిసిసి అధ్యక్షునికి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ నాయకులు గుండ, శ్యామ్, మసాడే చరణ్, జమీర్, సురేష్, శ్రీనివాస్, గంగారం, బాలు పాల్గొన్నారు.

నార్నూర్ : ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షుడు విశ్వప్రసాద్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లొఖండే దేవరావు, చౌహాన్ గోవింద్, జాకురుల్లఖాన్, చౌహాన్ దిగంబర్, విలాస్, కాంగ్రెస్ యూత్ నాయకులు షేక్ నసీర్, ప్రేంసింగ్, ఆడే దిగంబర్, షేక్ సత్తార్, ఉల్లాస్ పాల్గొన్నారు.

గణేష్ మండపం వద్ద అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వినాయక నవరాత్రుల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానానికి గందం వేణుగోపాల్, మురళీకృష్ణ ఆర్థిక సహాయం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, కార్యదర్శి కొడిపాక వేణుగోపాల్, గుండా ప్రమోద్, ముత్యాల ప్రదీప్, దిలిప్ టాటియా, సురేష్ టాటియా, కల్లూరి సంతోష్, పాపిని విక్రమ్, పోషకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

కూలిన పెంకుటిల్లు

నవతెలంగాణ-భీమిని



మండలంలో చిన్న తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి పోశయ్య-మొండమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి పెంకుటిల్లు నాని గోడలతో సహా నేల మట్టమైంది. ఉన్న చిన్న గూడు కూలిపోవడంతో తలదాచుకునే చోటు కువైందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితురాలు మొండమ్మ కోరుతోంది.

చిన్నారికి చికిత్సకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-తాండూర్



చౌటపల్లి గ్రామానికి చెందిన పోగుల తిరుపతి రెండు నెలల పాప వేదశ్రీ చికిత్స కోసం యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సాయంతో రూ.16వేలు సేకరించి అందజేశారు. వేదశ్రీ తండ్రి డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న యువ భారత్ శక్తి ఫౌండేషన్ సోషల్ మీడియా ద్వారా దాతల సహాయ సహకారాలతో డబ్బులు సేకరించి తిరుపతికి అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి జీవన్‌కుమార్, రోషన్ కుమార్, ఫండింగ్ ఇన్‌చార్జి చీమల నందు, చౌటపల్లి ఇన్‌చార్జి రాకేష్, బోయపల్లి బోర్డ్ ఇన్‌చార్జి వెంకటేష్, లింగదరిగూడెం ఇన్‌చార్జి హరీష్, సభ్యులు సురేష్, సాయికుమార్, రఘు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతోమహిళ ఆత్మహత్య

నవతెలంగాణ- హాజీపూర్



మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి గౌరక్క(40) ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో గొడవల కారణంగా మనస్థాపం చెంది గురువారం ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లి సమీప ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పంప్ హౌజ్ వద్ద నీటిలో దూకింది. శుక్రవారం మృతదేహం నీటిపై తేలియాడడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త శ్రీనివాస్ శుక్రవారం ఉదయం గౌరక్క అదృశ్యమైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్సై నరేష్ తెలిపారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘనసన్మానం



నవతెలంగాణ-జన్నారం

యువజన కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన సతీష్‌రెడ్డిని జన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



నవతెలంగాణ-హాజీపూర్

విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని నంనూర్ పునరావాస కాలనీలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన లగిషెట్టి మల్లేష్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్తుండగా 7వ నెంబర్ కాలనీ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్త్ వైర్లపై గేదె కాలు వేయడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, పరిహారం ఇప్పించాలని యజమాని కోరుతున్నాడు. గతంలో కూడా విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో గేదెలు మృతి చెందిన ఘటనలు జరిగాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ - కాసిపేట

బీజేపీ ఉపాధ్యక్షులు బాకీ నరేష్ తండ్రి లింగయ్య ఇటీవల మృతి చెందగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్టి వెంకటక్రిష్ణ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం దేవాపూర్ గ్రామానికి చెందిన యువకుడు గణేష్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని తల్లిదండ్రులను పరామర్శించారు. గణేష్ మృతికి వైద్య సిబ్బంది, అధికారులతో మాట్లాడి కారణాలు తెలుసుకొని తగు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లి కన్వీనర్ రాచర్ల సంతోష్ కుమార్, మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రేవెల్లి రాజలింగు, మండల నాయకులు రెడ్డి బాలరాజు, పెద్దపెల్లి శంకర్, దోమల రాంచందర్, చొప్పదండి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

30న స్థాయి సంఘా సమావేశాలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సెప్టెంబర్ 30న స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30న ఉదయం 10 గంటల నుండి 11వరకు స్థాయి కమిటీ-2 (గ్రామీణాభివృద్ధి), 11 నుండి మధ్యాహ్నం 12వకు స్థాయి కమిటీ-3 (వ్యవసాయం), మధ్యాహ్నం 12 నుండి 1 గంట వరకు స్థాయి కమిటీ -4 (విద్య, వైద్య సేవలు), 1 గంట నుండి 2వరకు స్థాయి కమిటీ-5 (మహిళా సంక్షేమం), మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 4వరకు స్థాయి కమిటీ-6 (సాంఘిక సంక్షేమం), 4 నుండి 5 వరకు స్థాయి కమిటీ-6 (నిర్మాణపు పనులు), స్థాయి కమిటీ-1 (ప్రణాళిక, ఆర్థిక) సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో కాలంలో హాజరు కావాలని కోరారు.

పన్నుపోటుతో కార్మికుల పరేషాన్

నవతెలంగాణ-నస్పూర్



11వ వేజ్ బోర్డులో చెల్లించిన ఏరియర్స్ డబ్బులలో రికవరీలను చూసి కార్మికులు చాలా ఆందోళనకు గురవుతున్నారని, ముఖ్యంగా ఆదాయపన్ను పేరిట కోత విధించడం కార్మికులను పరేషాన్‌లో పడేసిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు అన్నారు. శుక్రవారం ఎస్ఆర్పి-3 గనిలో కార్మికులను కలుసుకొని ఏరియర్స్‌పై అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ఆదాయ పన్ను కోత ఎంత విధించారో తెలియక కార్మికులు ఆందోళన పడ్డారన్నారు. కార్మికుల్లో అనుమానాలు తొలగించేందుకు 23 నెలల ఏరియాస్‌కు సంబంధించిన వివరాలతో కూడిన చిట్టీలను అందించాలని యాజమాన్యాన్ని కోరారు. అంతేకాకుండా వచ్చిన ఏరియర్స్ డబ్బులలో క్వార్టర్ ఉన్న కార్మికులకు రికవరీ ఎక్కువ అవుతోందన్నారు. ఇప్పటికైనా కోల్ ఇండియాలో 2011లో చేసుకున్న వేతన ఒప్పందం ప్రకారం అలవెన్స్‌పై ఐటి మాఫీ ఒప్పందాన్ని అమలు చేయాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించాలని డిమాండ్ చేశారు.

గురుకులాల క్రీడా సంబురాలకు ఏర్పాట్లు



నవతెలంగాణ-తాండూర్

వచ్చే నెల 13నుండి ప్రారంభం కానున్న రీజనల్ స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు బెల్లంపల్లి సీఈఓ ప్రిన్సిపాల్ అయినాల సైదులు తెలిపారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు జిల్లాలకు సంబంధించిన జోనల్ గేమ్స్ బెల్లంపల్లి సిఓఈ లో నిర్వహించడానికి సంక్షేమ గురుకులాల ఆర్సిఓ కొప్పుల స్వరూపరాణి స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శంకర్‌తో కలిసి ఏర్పాట్లకు క్రీడామైదాన పరిసరాలను పరిశీలించారు. అక్టోబర్ 13 నుండి 16వరకు రాష్ట్ర వ్యాప్తంగా 20 వేదికల్లో జోనల్ స్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని తెలిపారు. 11 అంశాల్లో 3విభాగాల్లో(అండర్ 14,16,19) పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మొదటి జోన్‌లోని 4జిల్లాల బాలురకు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బెల్లంపల్లిలో జరుగుతాయని తెలిపారు. కబడ్డీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, చెస్, క్యారం, రన్నింగ్‌లో వంద మీటర్లు, 2, 4,8,15వందల మీటర్లు 5కిలో మీటర్ల ఈవెంట్లు ఉన్నాయని తెలిపారు. షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హైజంప్ 11 రకాల క్రీడాంశాలు అండర్ 14 అండర్ 17 అండర్ 19 మూడు విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

- నల్లాల ఓదెలుకు బీఆర్ఎస్ నాయకుల కౌంటర్

నవతెలంగాణ-భీమారం



కన్నతల్లి లాంటి బీఆర్ఎస్‌ను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలును ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీఆర్ఎస్ మండల నాయకులు కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ మాట్లాడారు. ఢిల్లీ గులాంలకు చెన్నూరు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడితే ఇక్కడి ప్రజలు క్షమించారని మండి పడ్డారు. మూడు సార్లు ఈ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే చేసిన అభివృద్ధి ఏమిటో ఒక్కసారి గుర్తు చేయగలవా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ విప్ పదవి ఇవ్వడమే కాకుండా భార్యకు జడ్పీ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారని గుర్తు చేశారు. ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్, నాయకులు ఆత్కూరి రాము, వేముల శ్రీకాంత్‌గౌడ్, బొల్లం శ్రీనివాస్, వీరగోని రమేష్ పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 52/3లో అక్రమంగా చేపడుతున్న భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బెల్లంపల్లిలో ఆర్డీవోకు ఆదివాసీ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. 1/70 చట్టానికి విరుద్ధంగా దేవాపూర్ కంపెనీ కాలనీకి చెందిన ప్రభాకర్‌రావు అక్రమంగా మూడు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలని కోరారు. ఈ క్యాక్రమంలో ఆదివాసీ నాయక్ పోడ్ ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కనక రాజు, గౌరవాధ్యక్షుడు కుర్సింగ నాగేశ్వర్‌రావు, సోమని మల్లేశ్, సిడాం శంకర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

హోమియో వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని షాలోమ్ మినిస్ట్రీస్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కోరారు. రూరల్ హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికిరణ్, ప్రభుదాస్, పాస్టర్ షాలేంరాజ్, అభిషేక్, మంద రాజేష్, శంకర్, బర్నబస్, రాహుల్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో హోమం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గనిలో శుక్రవారం గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అత్యంత వైభవంగా క్రతువుల మంత్రోచ్చారణతో హోమం నిర్వహించారు. ఈ హోమ పూజలో శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ కాలరీ మేనేజర్ సుధీర్ జక్కులవార్ దంపతులు, బ్లాస్టింగ్ ఇన్‌చార్జి గొల్లపల్లి సంపత్ దంపతులు, సీనియర్ అండర్ మేనేజర్ వెంకన్న దంపతులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి దంపతులు గణపతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి వి.పురుషోత్తంరెడ్డి దంపతులు, జీఎం దంపతులను శాలువాతో సత్కరించారు. తదనంతరం మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, శ్రీరాంపూర్ సిఐ రమేష్‌బాబు, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

అన్నదానంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం బూడిదగడ్డ బస్తీలోని ట్యాంక్ సెంటర్‌లోని వినాయక మండపంలో పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అధిష్టానం ఎమ్మెల్యే చిన్నయ్యకు పార్టీ టికెట్ ఖరారు చేయడంతో నియోజకవర్గంలో బిజీబిజీగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గణేష్ నవరాత్రుల్లో భాగంగా గణేష్ మండళ్లను సందర్శించి అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. కార్యకర్తలకు స్వయంగా భోజనాలను వడ్డిస్తున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోష్క రమేష్, బడకల కమల, రమేష్, గడ్డం అశోక్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం బీమాగౌడ్, బస్తీ నాయకులు బడుకల లక్ష్మణ్, మాదరబోయిన మల్లేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల వినతి



నవతెలంగాణ-భీమిని

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశాలు శుక్రవారం పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, వేల్పుల శంకర్, ఆశా యూనియన్ నాయకురాలు రాజేశ్వరి మాట్లాడుతూ ఏండ్లుగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పని చేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అనేక రకాలుగా సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి కాలంలో నియంత్రించడానికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేశామని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆశాలు నాగుబాయి, లావణ్య, పద్మజ, వనజ, సంధ్య, రజిత, వసంత, రజిత పాల్గొన్నారు.

మతాలు వేరైనా మనమంత ఒక్కటే..!



నవతెలంగాణ-జైపూర్

మన కులాలు, మతాలు వేరైనా మనమంత ఒక్కటిగా జీవిస్తున్నాం..పండుగలు వేరువేరుగా చేసుకున్నా మనమంతా కలిపోతున్నామని ఇందారం గ్రామానికి చెందిన మహమ్మద్ ఫయాజోద్దీన్ అన్నారు. శుక్రవారం స్థానిక వాల్మీకి గణేష్ మండలి వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టిన ఆయన గురువారం ఆదివాసి గణేష్ మండలి వద్ద అన్నదానం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వాల్మీకి గణేష్ మండలి వద్ద మొక్కుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో కేసీఆర్ రెండవ కుమారుడి పాలన అంతం కావాలని దేవున్ని మొక్కుకున్నానని, దీనికి అందరి ఆశీర్వాదం ఉండాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రేమ్‌సాగర్ రావు ఆశీర్వాదంతో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలకు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండీ నదీం, మండల నాయకులు వార్డు సభ్యులు షేక్ షరీఫ్, గౌసుద్దీన్, వాల్మీకీ,ఆదివాసి నాయకులు, యువతి యువకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-తాండూర్

మండల సర్వసభ సమావేశం శనివారం 11గంటలకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరవుతారని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోడంలో భేష్

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధి షెట్‌పల్లి గ్రామ పంచాయతీకి చెందిన తన్నీరు మౌనిక ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోడంలో మొదటి స్థానంలో నిల్చిందని సర్పంచ్ మేడి రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచ్చత హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామ పంచాయతీలో మేరీ మట్టి మేరా దేశ్ క్యాక్రమం ద్వారా తన్నీరు మౌనికకు పుష్పగుచ్చం అందజేసి అభినందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరిన ఆయన ఫ్రైడే డ్రై డే సందర్భంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మురికి నీరు నిల్చిన చోట ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి బియ్యం, మట్టి సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతి కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నవతెలంగాణ-తాండూర్

పంచాయతీరాజ్ శాఖ సాంకేతిక వ్యవస్థలో పనిచేస్తున్న ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీల్లో పనిచేస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ప్రాజెక్ట్ మేనేజర్ నరేందర్ వివిధ మండలాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టు మేనేజర్లుగా పనిచేస్తున్న 33 మందికి, పంచాయతీల్లో పనిచేస్తున్న 1,619 ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేలు అమలు చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 23, 2023 | www.navatelangana.com

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

నవతెలంగాణ-నార్నూర్

పౌష్టికాహారంతోనే గర్భిణీలు, బాలింతలు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు గర్భిణులకు సూచించారు. శుక్రవారం గుంజాల ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో ఉన్న 43 గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాటించాల్సిన ఆరోగ్య సలహాలు సూచనలు చేశారు. సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత, కాన్పులు, కాన్పుల మధ్య వ్యవధి కోసం తాత్కాలిక పద్ధతులైన నిరోధ్, ఓరల్ పిల్స్, లేదా అంతర ఇంజెక్షన్ ఉపయోగించుకోవాలని



సూచించారు. తద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, ఆరోగ్యంగా, మానసికంగా ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. వైద్యశిబిరంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, సీహెచ్‌ఓ లక్ష్మి, వైద్య సిబ్బంది సుశీల, రవీందర్, ఈశ్వరి, విద్య ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సామాజిక సేవ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రామ్ అంతర్వేది పాల్గొని, విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటరీలుగా చేరి సామాజిక సేవ స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరడం వల్ల కలిగే ఉపయోగాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల పీఓలు దయాకర్, అష్రాఫ్ అలీ, అధ్యాపకులు జాకీర్ హుస్సేన్, శ్రీనివాస్, సంతోష్ కుమార్, రఘునాథ్, రమేష్, ఆనందం, నర్సింగ్‌రావు, ప్రతాప్ సింగ్, విద్యార్థులు ఉన్నారు.



సమన్వయంతో జిల్లాను అభివృద్ధి చేద్దాం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- సాదాసీదాగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సమన్వయంతో జిల్లాను అభివృద్ధి చేద్దామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు, సంబంధిత నివేదికలను సభ దృష్టికి తీసుకువచ్చారు. కాగా వ్యవసాయ శాఖ నివేదికను జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ వెల్లడించగా, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జోక్యం చేసుకొని గతంలో భారీ వర్షాలు కురిసాయని, దీంతో వంటలు నష్టపోయాయని అన్నారు. పంట పొలాల్లో ఇసుకమేటలు పేరుకుపోయాయని, ఇప్పటికీ అధికారులు శాఖ పరమైన నష్టపరిహారంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, సర్వే చేయకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అలాగే సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి సైతం ఈ విషయాన్ని లేవనెత్తారు. దీంతో సర్వే నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి అంగన్‌వాడీల సమ్మె జరుగుతుందని, గర్భిణీలకు బాలింతలకు, పిల్లలకు పోషకాహారం అందే విధంగా చూడాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. కాగా సారంగాపూర్ జెడ్పీటీసీ జోక్యం చేసుకొని అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా అంగన్‌వాడీల పనులను వేరే శాఖ అధికారులతో కొనసాగించడం, బెదిరించడం సరి కాదన్నారు. దీంతో పౌష్టిక ఆహారం అందడం లేదన్నారు. ఈ విషయమై జెడ్పీటీసీలు జీవన్‌రెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఇరువురి మధ్య కొంత వాగ్వావాదం కొనసాగింది. దీంతో మంత్రి జోక్యం చేసుకొని అంగన్‌వాడీలకు దేశంలో ఎక్కడలేని విధంగా వేతనాలు ఇవ్వడం జరుగుతుందని, అన్ని సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే విధులు నిర్వహిస్తూ సమ్మెకు దిగాలని, ప్రభుత్వం చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటుందని నచ్చజెప్పారు. జిల్లా ప్రగతి పథంలో కొనసాగుతుందని సీఎం కేసీఆర్‌తో మెడికల్ కళాశాలను జిల్లాకు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పలు అభివృద్ధి పనులపై మాట్లాడారు. ఈనెల 25న మంత్రి కేటీఆర్ జిల్లాకు వస్తున్నారని, సోన్ మండలంలోని ఆయిల్ పామ్ పరిశ్రమను నిర్మాణ పనులను ప్రారంభిస్తారని అన్నారు. దీంతో జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లాలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. ఆయిల్ పామ్‌తో రైతులకు లాభాలు చేకూరుతాయని తెలిపారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయని, ఎన్నికల కోడ్ ఎప్పుడైనా రావచ్చని ఈలోపు వచ్చిన నిధులతో వృధా చేయకుండా పనులను చేసుకోవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు



సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మెన్ కొరిపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కృషితోనే జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధీర్, అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

నవతెలంగాణ-కడెం

మండలంలోని కల్లెడ గ్రామపంచాయతీలో గోపాలమిత్ర సెంటర్ పరిధిలోని పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గోవు, గేదె జాతికి చెందిన పశువులకు కడెం మండల పశు వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ పరీక్షలు నిర్వహించి, ఉచిత గర్భకోశ మందులను పంపిణీ చేశారు. పశుపెంపకందారులకు పశువుల పట్ల ఎటువంటి సమస్యలున్న మండల పశు వైద్య సిబ్బందికి సమచారం అందించి ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత మందులను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంబడి లావణ్య తిరుపతి, విజయ డెయిరీ మేనేజర్ వెంకటస్వామి, పశు వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నార్నూర్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతలనాలను అందించాలని ఏఐటీయూసీ నాయకులు ఝాడే నాందేవ్, మధ్యాహ్నం భోజనం కార్మికులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వంట కార్మికులుగా పనిచేస్తున్నా తమకు కేవలం రూ.వెయ్యితో పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. వెంటనే పెండింగ్ ఐదునెలల వేతనంతో పాటు ప్రభుత్వం పెంచిన రూ.3 వేలను కలిపి ప్రతి నెల ఐదో తేదీలోపు బిల్లును చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మధ్యాహ్నం భోజనం కార్మికులు ఝాడే తాయబాయి, సక్రవంతి, శివాబాయి, యమున బాయి, జైతూబాయి, జగ్గెరావ్ ఉన్నారు.

నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 35 మంది నిరుపేద విద్యార్థులకు రూ.5 వేల విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులను శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో ఒకసారి ఈ ప్రాథమిక పాఠశాలకు రావడం జరిగిందని, ఆ సమయంలో విద్యార్థులకు సరిపడే నోట్ పుస్తకాలు ఇస్తానని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన తాగడానికి మంచి నీరు, మరుగుదొడ్లు, ప్రభుత్వం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులు దౌర్జన్యంపై ఫిర్యాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఆదివాసీ, దళిత మహిళ అంగన్‌వాడీ ఉద్యోగులపైన పోలీసులు దౌర్జన్యం చేసి కులం పేరుతో దూశించి, కొట్టి గాయపరచడంపై హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌కు అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ ఆదివాసీ, దళిత మహిళలపై దాడి చేసిన ఎస్ఐ, సీఐ, డీఎస్పీ తదితరులపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులే దాడి చేసి పైగా పోలీసులను అంగన్‌వాడీ ఉద్యోగులే కొట్టినట్లుగా కేసులు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఆదివాసీ దళిత అంగన్‌వాడీ ఉద్యోగులపై దాడులు ఆపాలని పెట్టిన కేసులు ఎత్తివేయాలని వారికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ తరపున పి.జయలక్ష్మి, ఎస్.కరుణ కుమారి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోషణ్ మాసం వారోత్సవాలు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక 3వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గర్భిణీ స్త్రీలు, బాలింతలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు లలిత, ఉమా, ఇర్ఫాన, మనిషా, ఏఎన్ఎం సుమంగళ, అంగన్‌వాడీ టీచర్లు పి.శాంత, లక్ష్మి, షాహిరా ఖాతూన్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు బాధ్యతగా పౌష్టికాహారం అందించాలి

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

నవతెలంగాణ-ఉట్నూర్

గర్భవతులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంలో కుటుంబ సభ్యులు సైతం బాధ్యతగా తీసుకోవాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. శుక్రవారం మండలంలోని దొంగచింత గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నుగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంబాయికి పురుటినొప్పులు రావడంతో వాగు ఒడ్డుననే ప్రసవించి, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలసిందే... కాగా ఈ విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీఓ శుక్రవారం స్థానిక జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆత్రం భీంబాయి వద్దకి వెళ్లి ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు, పౌష్టికాహారలోపంతో బాదపడుతున్న వారికి పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం, అధికారులు బాధ్యతగా తీసుకున్నప్పటికి, కుటుంబ సభ్యులు సైతం బాధ్యయుతంగా ఉండాలని అన్నారు. పుట్టిన చిన్నారులతో పాటుగా



బాలింతలు సైతం ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసి, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ఇంకా ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను వినియోగించడంలో కొందరూ గిరిజనులు విఫలమవుతున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు చాలా బాధకరమైన విషయమన్నారు. ప్రసవ సమయంలో మహిళలను వారం రోజుల ముందుగానే ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి సుఖ ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అంతకుముందు ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించి పరిశీలించారు. పీఓ వెంట వైద్యులు డా.మహేందర్, శ్వేత, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ జాడి విమల, స్టాఫ్ నర్సులు శ్రీలత, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

24న సత్యశోధక్ స్థాపన దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు 24 సెప్టెంబర్ 1873న సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి, నేటికి 150 సంవత్సరాలు పూర్తిచేసుకుందని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యశోధక్ సమాజ స్థాపన 150వ దినోత్సవాన్ని ఈ నెల 24న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాలీ కులస్తులు, బహుజనవాదులంతా కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

మహిళ బిల్లు పట్ల బీజేపీ సంబురాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ నూతన భవనం వేదికగా తీసుకువచ్చిన మహిళ బిల్లు చాలా గొప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. ఉభయ సభల్లో మహిళా బిల్లు ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణంలో ఆమె క్యాంపు కార్యాలయంలో బీజేపీ శ్రేణులతో కలిసి సంబురాలు నిర్వహించుకున్నారు. టపాసులు కాల్చి ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో మహిళలు రాజకీయంగా అలాగే మిగతా రంగాలలో తమసత్తా ఏమిటో నిరూపించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు.

తహసీల్దార్, సర్పంచులకు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎన్నిక కావడంతో భరంపూర్ సర్పంచ్ భాగీరథబాయి, ఖోడద్ సర్పంచ్ ఆనంద్, కాగా కొత్తగా బదిలీపై వచ్చిన తహసీల్దార్ రాజ్ మోహన్ శుక్రవారం రైతు వేదికలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీడీఓ రమకాంత్, ఎంపీఓ దిలీప్‌కుమార్, ఎంఈఓ నారాయణ, సర్పంచులు కరుణాకర్ రెడ్డి, మహేందర్ యాదవ్, పోతారెడ్డి, ఉపాధ్యక్షురాలు దివ్య, ఎంపీటీసీలు గోదావరి, చంటి, గౌరమ్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఐటీడీఏ డీడీ ఎం.దిలీప్ కుమార్



నవతెలంగాణ-ఉట్నూర్

జిల్లాలోని గిరిజన విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న గిరిజన క్రీడోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు డా. ఎం.దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని పీఎమ్మార్సీ భవనంలో ఐటీడీఏ శాఖలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన గిరిజన క్రీడోత్సవాలలో ఉట్నూర్ ఐటీడీఏ రెండో స్థానంలో నిలువడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ ఏడాదిలో నిర్వహించే క్రిడోత్సవాలలో ఉట్నూర్ ఐటీడీఏ ప్రథమ స్థానంలో నిలిపేలా అందరూ కృషిచేయాలని కోరారు. ఆదిలాబాద్ డివిజన్ స్థాయి పోటీలు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో, బోథ్ డివిజన్ స్థాయి పోటీలు జాతర్ల క్రీడా పాఠశాల మైదానంలో, ఉట్నూర్ డివిజన్ స్థాయి పోటీలు స్థానిక కెబి కాంప్లెక్స్ మైదానంలో, నిర్మల్ డివిజన్ స్థాయి పోటీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 29న నిర్వహించడం జరుగుతుందన్నారు.. జోనల్ స్థాయి పోటీలు అక్టోబర్ 3, 4 తేదీల్లో ఉట్నూర్ క్రీడా పాఠశాల మైదానంతో నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన క్రిడోత్సవాల్లో పాల్గొనే గిరిజన క్రీడా విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి, ఈ పోటీలలో పాల్గొనేందుకు ప్రతిభావంతులైన గిరిజన క్రీడాకారులను పారదర్శంగా ఎంపిక చేయాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లేటిక్స్, టెన్నికాయిట్, ఆర్చరీ తదితర క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్ స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధి, ఏసీఎంఓ జగన్, ఏటీడీఓలు క్రాంతి, సౌజన్య, నీహరిక, పీడీలు రమేశ్, హేమంత్, మధుసుదన్, ఇతర అధికారులు ఉన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

నవతెలంగాణ-తలమడుగు

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం శుక్రవారం రైతు వేధిక భవనంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరైనప్పటికీ మిగతా శాఖలు హాజరు కాకపోవడంతో సర్పంచులు కళ్లెం కరుణాకర్‌రెడ్డి, ఆనంద్‌తో పాటు మిగతా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకొకసారి సమావేశం నిర్వహిస్తే వివిధ శాఖలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు గైర్హాజరు కావడం పట్ల మండిపడ్డారు. అధికారులే లేకుంటే సమస్యలు ఎవరికి చెప్పాలంటూ వాపోయారు. ఆర్ అండ్ బి శాఖతో పాటు సంబంధిత కాంట్రాక్టర్ మండల కేంద్రంలో మంజూరైన పనులను నెలల తరబడి ప్రారంభించక పోవడం పట్ల ఆ శాఖ అధికారులతో పాటు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నీళ్ల రావడం లేదని అదేవిధంగా లీకేజీలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ



విధులను ఇష్టానుసారంగా నిర్వర్తిస్తూ కనీసం సమావేశాలకు కూడా రాకపోవడం బాధాకరమని అన్నారు. గైర్హాజరైన అధికారులపై సమావేశంలో తీర్మానాలు చేసి జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి కల్పించుకొని గైర్హాజరైన అధికారులపై జిల్లా పరిషత్ సమావేశంలో జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రమకాంత్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీఓ దిలీప్‌కుమార్, పశు వైద్యాధికారి దూద్‌రాం, డాక్టర్ హరీష్, ఎంఈఓ నారాయణ, ఏఈ సతీష్ కుమార్, సొసైటీ సీఈఓ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో నిర్మల్ పట్టణ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమకారుడు బాల గంగాధర్ తిలక్ మొట్టమొదటి సారిగా గణేష్ నవరాత్రులు ఏర్పాటు చేశారని అన్నారు. ఆయన చూపిన మార్గంలో ఈరోజు భారత దేశంలో ఎంతటి మారుమూల ప్రాంతంలో అయిన సరే ఈ గణేష్ నవరాత్రులు భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారని అన్నారు. మరోవైపు అటు మహారాష్ట్ర పూణేలో పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తారని, ఇటు హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్ గణేశుడు చాలా పెద్ద ఎత్తున విగ్రహం ఏర్పాటు చేస్తారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిర్మల్ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఎంతో బాగా ఉంటుందని అన్నారు. గణేష్ నిమజ్జనం కోసం బంగల్‌పేట్‌లో ఉన్న వినాయక సాగర్ వద్ద ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టనున్నట్లు తెలిపారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ఆదిలాబాద్ దూసుకుపోతుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలల్ అజయ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ వార్డుల అభివృద్ధికి ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక కృషితో రూ.50 కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు. దీంతో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబురాలు నిర్వహించుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పట్టణ అధ్యక్షులు అజయ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక మన నిధులు మనం సమకూర్చుకోవడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంలో పార్టీలకు అతీతంగా ప్రతి వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు ఇజ్జగిరి నారాయణ, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు రమేష్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, పవన్ నాయక్, వెంకన్న, ప్రకాష్, మహేందర్, మహాకాల్ అజయ్, ప్రమీల, పర్వీన్, సురేఖ, రమ పాల్గొన్నారు.